

ఒకప్పుడు కేవలం దీపావళి పండుగ వస్తేనే బాణా సంచా (టపాకాయలు) పేల్చేవాళ్లు. అయితే మారుతున్న కాలంలో పండుగలు, పబ్బాలు, చావులు, తద్దినాలు.. పుట్టిన రోజులు.. పెళ్లిళ్లు.. రాజకీయ నాయకుల రాకపోకలు... ఇలా ఒకటేమిటి.. ప్రతి చిన్న కార్యక్రమానికి టపాకాయలు కాల్చడం ప్రజలకు అలవాటైపోయింది. ఇంకా చెప్పాలంటే.. టపాకాయలు కాల్చడం ఓ హోదాగా మారిపోయింది. దీనిని అలుసుగా తీసుకున్న టపాకాయల దుకాణదారులు విచ్చలవిడిగా ధరలు పెంచి ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారు. అడ్డూఅదుపు లేని ధరలను నియంత్రించాల్సిన అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో జిల్లాలో టపాకాయల దుకాణదారులు ఆడిందే ఆటగా సాగుతోంది.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

బాణాసంచా దుకాణాల నిలువు దోపిడీ

- రూ.కోట్లల్లోనే వ్యాపారాలు
- విపరీతమైన ధరలు.. నియంత్రించేవాళ్లేరి.?
- రహదారుల మీదే దుకాణాలు
- జనావాసాల మధ్య గోడౌన్లు
- అనుమతులు గోరంత.. అమ్మకాలు కొండంత
- ప్రభుత్వాదాయానికి భారీ గండి
- దుకాణదారులు ఆడిందే ఆట..

జిల్లాలో సుమారు 50కిపైగా హోల్‌సేల్ అనుమతులతో టపాకాయల దుకాణాలు నడుపుతున్నారు. ఈ దుకాణాలలో ఏ ఒక్కటి కూడా తమకున్న అనుమతుల మేరకు వ్యాపారాలు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం వందల కిలోల టపాకాయలు అమ్మకాలు చేసేందుకు అనుమతులు పొంది అక్రమంగా వేలు.. ఇంకా చెప్పాలంటే.. లక్షలాది కిలోలు అమ్ముకుంటున్నారు.. కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇంత జరుగుతుంటే సేల్స్‌ట్యాక్స్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు ఏం చేస్తున్నారనే అనుమానం అందరికీ కలగవచ్చు. అయితే ఏం జరుగుతుందో?. ఎవరెవరికి మామూళ్లు అందుతున్నాయో? టపాకాయల వ్యాపారం మూడు చిచ్చుబుడ్లు.. ఆరు మతాబులు అనే రీతిలో జరుగుతోంది. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో టపాకాయల వ్యాపారుల అక్రమ దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

50కి పైగా టపాకాయల దుకాణాలు

జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా టపాకాయల దుకాణాల సంఖ్య పెరుగుతోంది. రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలలో పదుల సంఖ్యలో టపాకాయల దుకాణాలు ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేశారు. రాయచోటి పట్టణంలో మూడు శాశ్వత అనుమతులు (పర్మినెంట్ లైసెన్స్) పొందిన దుకాణాలు ఉన్నాయి. చిన్నమండెంలో ఒకటి, పీలేరులో నాలుగు, వీరబల్లిలో మూడు దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ దీపావళి పండుగతో సంబంధం లేకుండా ఏడాది పొడవునా టపాకాయల అమ్మకాలు జరుగుతూ ఉంటాయి. గుర్రంకొండ మండలంలో రెండు దుకాణాలు ఎటువంటి అనుమతులు లేకుండానే నడుస్తున్నాయి. పోలీసు, ఫైర్, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో బస్టాండు సమీపంలోనే దర్జాగా అమ్మకాలు చేస్తున్నారు. పెద్దమండెం మండలంలో అనుమతులతో ఇద్దరు దుకాణాలు నడుపుతున్నారు. పెద్దతిప్పసముద్రంలో రెండు షాపులకు అనుమతులు ఉన్నాయి. దీపావళికి మాత్రమే వ్యాపారాలు చేస్తారు. నిమ్మనపల్లె మండలం బస్టాండు సెంటర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండానే టపాకాయల అమ్మకాలు జరుగుతున్నాయి. కేవలం దీపావళికి మాత్రమే తాత్కాలిక అనుమతులు పొంది సంవత్సరమంతా అమ్ముతారు. రైల్వేకోడూరులో ఒక దుకాణానికి మాత్రమే శాశ్వత అనుమతులు ఉన్నాయి. కురబలకోట మండలంలో ఒక దుకాణాన్ని ఎటువంటి అనుమతులు లేకున్నా నిర్వహిస్తున్నారు. వాల్మీకిపురం మండలంలో ఒక దుకాణం అనుమతులు కలిగి నడుస్తోంది. రాజంపేటలో ఒక దుకాణానికి మాత్రమే శాశ్వత అనుమతులు ఉన్నాయి. పుల్లంపేట మండలంలో ఏడాది పొడవునా టపాకాయలు అమ్మే దుకాణం కడప- చెన్నై జాతీయ రహదారిని ఆనుకుని ఉంది. గతంలో ఈ షాపుపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. తంబళ్లపల్లెలో శాశ్వత అనుమతులు ఉన్న దుకాణం ఒకటి ఉంది. ములకలచెరువు మండలంలో అనధికారికంగా ముగ్గురు ఇళ్లలో దుకాణాలు నడుపుతున్నారు. మదనపల్లె పట్టణంలో మూడు దుకాణాలు, లక్కిరెడ్డిపల్లెలో ఒక దుకాణం అనుమతులతో నడుస్తోంది. ఓబులవారిపల్లె మండలంలో అనుమతులు లేకుండానే ఓ దుకాణంలో సంవత్సరం పొడవునా అమ్మకాలు జరుగుతున్నాయి.

తాత్కాలిక అనుమతులు

సాధారణంగా దీపావళి పండుగ సందర్భంగా ప్రజల సౌకర్యం కోసం జిల్లా అధికారులు టపాకాయలు అమ్ముకోవడానికి తాత్కాలిక అనుమతులు ఇస్తారు. దీపావళి పండుగ వారం, పది రోజుల ముందు నుంచి పండుగ రోజు వరకు ఈ అనుమతులు వర్తిస్తాయి. అయితే చాలామంది కేవలం దీపావళి అనుమతులతోనే ఏడాది పొడవునా యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు. శాశ్వత అనుమతులు ఉన్న వాళ్లు సైతం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అనుమతిని పునరుద్ధరించుకోవాలి. అనుమతుల పునరుద్ధరణ కూడా పెద్ద తతంగమే అని చెప్పుకోవాలి. అయితే వడ్డించేవాడు మనవాడైతే.. ఎక్కడ కూర్చున్నా.. ఫరవాలేదనే సామెతను నిజం చేస్తూ.. అనుమతులు ఇవ్వాల్సిన శాఖల అధికారులు పలువురు మామూళ్లు తీసుకుని సరైన జాగ్రత్తలు లేకపోయినా అనుమతులు ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం వందలు, వేల సంఖ్యలో వాహనాలు తిరిగే జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న దుకాణాలకు సైతం అనుమతులు ఇవ్వడం,, ఉన్న అనుమతులనే పునరుద్ధరణ చేయడం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా టపాకాయల దుకాణాలకు అనుమతులు ఇవ్వాలంటే పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖల నివేదికలు తప్పనిసరి. అయితే పలువురు టపాకాయల వ్యాపారులు ఆ అధికారులను మామూళ్లతో మచ్చిక చేసుకుని నివేదికలు తమకు అనుకూలంగా తెప్పించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



చిన్నమండెం మండల కేంద్రంలోని టపాకాయల అమ్మకం దుకాణం

ప్రభుత్వాదాయానికి భారీ గండి

జిల్లాలో టపాకాయల దుకాణాల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. సేల్స్‌ట్యాక్స్ అధికారులను తమ దారిలోకి తెచ్చుకున్న వ్యాపారులు కోట్లలో వ్యాపారం చేస్తూ కేవలం లక్షల్లో జరుగుతున్నట్లు చూపుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడానికి తమ వంతు సాయం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చిన్నమండెం మండల కేంద్రంలో నడుస్తున్న దుకాణం ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లోనే పెద్దదిగా చెప్పుకోవచ్చు. కడప-బెంగళూరు రహదారికి ఆనుకుని ఈ షాపు ఉంది. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణనష్టం పెద్దగా ఉండే ప్రమాదముంది. ప్రభుత్వం వీళ్లకు ఇచ్చిన అనుమతి ప్రకారం కేవలం 500 కిలోల టపాకాయలు మాత్రమే విక్రయించాలి. అయితే ఈ దుకాణం నుంచే కడప, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సైతం వ్యాపారులు వచ్చి టపాకాయలు తీసుకెళతారు. ఈ లెక్కన ఈ షాపు నుంచి ఎన్ని కిలోల టపాకాయలు అమ్మకాలు జరుగుతున్నాయో..? అధికారులే చెప్పాలి. కోట్ల రూపాయల విలువ చేసే టపాకాయల అమ్మకాలు జరుగుతున్నా అధికారులు కేవలం లక్షల రూపాయలకు మాత్రమే పన్నులు కట్టించుకుంటున్నట్లు తెలిసింది. దీనికి తోడు ఎన్ని రూపాయలకు టపాకాయలకు కొనుగోలు చేసినా తెల్లకాగితంపైన మాత్రమే రాసి ఇస్తారు. ఇలా కళ్ల ముందే ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా.. సేల్స్‌ట్యాక్స్ అధికారులు నోళ్లు మెదపడం లేదు. దీపావళి పండుగ ఇక ఒకటన్నర నెల ఉండడంతో ఇప్పటి నుంచే టపాకాయల వ్యాపారుల హడావుడి మొదలైంది. తాత్కాలిక అనుమతుల కోసం అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఇదే నేపథ్యంలో శాశ్వత అనుమతులు ఉన్న దుకాణాల్లో ఏర్పాట్లు, ముందు జాగ్రత్తలను మరోసారి పరిశీలించాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా అనుమతుల మేర అమ్మకాలు జరిగేలా చూడడంతో పాటు అమ్మకాలు జరిగినంత ప్రభుత్వానికి పన్నులు వసూళ్లు జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పనారెడ్డి, చిత్రంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విజయవాడ వరద బాధితులకు అండ

- చంద్రబాబుకు రూ.15 లక్షలు చెక్కు అందజేసిన జయచంద్రారెడ్డి
- సేకరించిన మరో 6.45 లక్షల చెక్కులు అందజేత

ములకలచెరువు, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితులకు తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి అండగా నిలిచారు. అమరావతిలోని సెక్రటేరియట్‌లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి తమ వంతు సహాయంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పనారెడ్డి రూ.15 లక్షల చెక్కు అందజేశారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గంలోని విద్యాసంస్థల నుంచి సేకరించిన మరో రూ.6.45 లక్షల చెక్కులను అందజేశారు. ఇందులో కురబలకోట మండలం అంగళ్లు విశ్వం విద్యా సంస్థల అధినేత ప్రభాకర్‌రెడ్డి రూ.5 లక్షలు, ములకలచెరువులోని శ్రీశారదా విద్యామందిర్ కరస్పాండెంట్ శ్రీవాణి సనత్‌కుమార్ రూ.55 వేలు, శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ రామదాసు రూ.50 వేలు, ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిద్ధారెడ్డి రూ.20 వేలు, ఎస్వీవీబీ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి రూ.15 వేలు, చౌడసముద్రంకు చెందిన వెంకట్‌రెడ్డి రూ.5 వేలు విరాళాలు సేకరించి చెక్కులను చంద్రబాబుకు అందజేశారు. కష్టకాలంలో విజయవాడ ప్రజలకు అండగా నిలిచిన జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పనారెడ్డిలను చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యలను ఆయన చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి : కలెక్టర్

- స్వభావ్ స్వచ్ఛతా- సంస్కార్ స్వచ్ఛతా పటిష్టంగా నిర్వహించాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 12: జిల్లా వ్యాప్తంగా స్వభావ్ స్వచ్ఛతా- సంస్కార్ స్వచ్ఛతా కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీ నుంచి పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి స్వచ్ఛతాహి సేవలో భాగంగా రాష్ట్రంలో ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు పంచాయతీలలో, పట్టణాలలో విస్తృతంగా అమలు చేసి పారిశుధ్యం మెరుగు పడేలా నిర్వహణ ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతాహి భాగ్యదారి, సంపూర్ణ స్వచ్ఛతా, సఫాయి మిత్ర, సురక్ష సివిర్స్ అంశాలతో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. అక్టోబరు 2వ తేదీ మహాత్మునికి నివాళిగా స్వచ్ఛభారత్ దివస్‌గా పరిగణించాలన్నారు. కార్యక్రమానికి ఈనెల 13 శుక్రవారం నుంచి కార్యాచరణ రూపొందించుకుని జిల్లా వ్యాప్తంగా క్లీన్ అండ్ గ్రీన్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ కార్యక్రమాలపై సాంస్కృతిక పండుగలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ, పంచాయతీ, డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, మున్సిపల్, టూరిజం శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా పొలాల్లోకి దారివ్వండి

- కలెక్టర్‌కు వాల్మీకిపురం ప్రజల వినతి

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 12: వాల్మీకిపురం మండలంలోని విఠలం గ్రామంలో ఎన్‌హెచ్-71 రహదారికి మేము భూములు ఇస్తే మా పొలాల్లోకి దారి లేకుండా చేస్తున్నారని గురువారం విఠలం గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారికి మా ఊరి ప్రజలందరూ భూములిస్తే మా పొలాల్లోకే దారి లేకుండా చేస్తున్నారని వారు అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అప్పటి కలెక్టర్ గిరిషా మా గ్రామానికి వచ్చి మీ భూముల్లోకి వెళ్లడానికి దారి ఏర్పాటు చేస్తామని చెప్పినా రోడ్డు వేసే సంస్థ వారు అ విషయాన్ని పట్టించుకోలేదని తెలిపారు. ఈ విషయంపై వారిని ప్రశ్నిస్తే పోలీసుల ద్వారా బెదిరిస్తున్నారని వారు తెలిపారు. ఎంతో కాలంగా మా పొలాల్లోకి వెళ్లే దారి వద్ద బ్రిడ్జి వేసి రైతులను అడ్డుకోవడం అన్యాయమన్నారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాయచోటి పట్టణ కార్యదర్శి శివగంగిరెడ్డి, రామాంజులరెడ్డి, నగేష్, విఠలం గ్రామస్తులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియచేస్తున్న విఠలం గ్రామస్తులు

జాతీయ క్రికెట్ టీం కెప్టెన్‌గా అనీల

- ప్రతిభ చూపుతున్న నందలూరు విద్యార్థిని



జాతీయ స్థాయి క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఎంపికైన ఆరెం అనీల

నందలూరు, సెప్టెంబరు 12: జాతీయ స్థాయిలో జరిగే కేంద్రీయ విద్యాలయాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్టులో మన రాష్ట్రం నుంచి నందలూరుకు చెందిన విద్యార్థిని ఆరెం అనీల కెప్టెన్‌గా ఎంపికైంది. ఈనెల 22న రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్‌లో జాతీయ స్థాయిలో అండర్-17 విభాగంలో కేంద్రీయ విద్యాలయాల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో జాతీయ స్థాయిలో 7 జట్లు మాత్రమే పాల్గొంటాయి. ఈ జట్లల్లో మన రాష్ట్రం నుంచి మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆరెం రామచంద్రయ్య, సుమలత దంపతుల కుమార్తె రాజంపేట కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆరెం అనీల కెప్టెన్‌గా ఎంపికైంది. నందలూరు క్రికెట్ సబ్‌సెంటర్‌లో 4 సంవత్సరాలుగా శిక్షణ పొందుతోంది. అనీల మాట్లాడుతూ జాతీయ స్థాయిలో క్రికెట్ జట్టుకు ఎంపిక కావడంతో కోచ్‌లు గయాజ్, ఫైరోజ్‌ఖాన్‌లోడీ, శివకోటిలకు రాజంపేట కేంద్రీయ విద్యాలయం పీఈటీ రాహుల్‌కుమార్ పచ్చాసీయా, ప్రిన్సిపాల్ మీరాజ్‌కుమార్, శ్రీవాస్తవలకు కృతజ్ఞతలు తెలియజేసింది.

అట్టహాసంగా జాతీయ యోగా మీట్ ప్రారంభం



యోగా మీట్‌ను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 12: మండలంలోని వలసపల్లె పంచాయతీలో జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం జాతీయ యోగా మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు, ఆర్గనైజర్ బెంగళూరు రూరల్ జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ చక్రవర్తి నిర్వహించారు. యోగా మీట్‌కు ముఖ్య అతిథులుగా మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, హైదరాబాదు రీజియన్ ఆఫీ సు అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నా రు. ఇందులో గెలుపొందిన వారికి సబ్‌కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు యోగా ప్రాముఖ్యతను తెలిపారు. యోగా మీట్‌ను నిర్వహిస్తున్న జవహర్ నవోదయ మదనపల్లె ప్రిన్సిపాల్‌ను, సిబ్బందిని అభినందించారు. యోగా అనేది మనిషి ఏకాగ్రతను పెంచుతుందని, మానసిక స్థిరత్వంతో పాటు దృఢత్వం కలిగిస్తాయని వారు తెలిపారు. విద్యార్థుల యోగా విన్యాసాలను తిలకించి అభినందించారు. ఇందులో ప్రథమ బహుమతి పాట్నా రీజియన్‌కు దక్కగా, ద్వితీయ బహుమతి హైదరాబాదు రీజియన్‌కు, తృతీయ బహుమతి పూణే రీజియన్‌కు దక్కింది. కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు, పూ ర్వ విద్యార్థులు హాజరయ్యారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ వేలాయుదన్, నవోదయ విద్యాలయ బెంగళూరు రూరల్ ప్రిన్సిపాల్ చక్రవర్తి, సత్యసాయి నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు, పూర్వ విద్యార్థులు సుబ్రహ్మణ్యం, రాంబాబు, మీనానాగలక్ష్మి, మోహన్‌వల్లి, శివనాథరెడ్డి, జనార్ధన్, గోపి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులపై వేటు

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 12: జగనన్న కాలనీలో అవినీతికి పాల్పడిన ఇద్దరు హౌసింగ్ అధికారులను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి మండలంలోని నారాయణరెడ్డిగారిపల్లెలో ఉండే జగనన్న కాలనీలో ఇసుక అక్రమాలపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా రాయచోటి ఆర్డీవో విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందించగా వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, రాయచోటి అర్బన్ ఇన్‌చార్జ్ ఏఈ శివశంకర్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించినట్లు జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ శివయ్య తెలిపారు.

చిత్రహింసలు పెడుతున్నారు...

- కువైత్ నరకం నుంచి నన్ను కాపాడండి...
- సెల్ఫీ వీడియోలో మహిళ ఆవేదన
- స్పందించిన మంత్రి మండిపల్లి



సంబేపల్లి, సెప్టెంబరు 12 : బతుకు తెరువు కోసం కువైత్‌కు వెళ్లిన ఓ మహిళను అక్కడ చిత్రహింసలకు గురి చేస్తున్నారని, తనను కాపాడాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సెల్ఫీ వీడియోలో కోరింది. దీనికి స్పందించిన మంత్రి ఆమెను ఎలాగైనా ఇండియాకు రప్పించాలాని సంబంధిత మంత్రి, అధికారులకు ఆయన లెటర్ రాశారు. వివరాలిలా ఉన్నాయి. సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లికు చెందిన కవిత అనే మహిళ బతుకుతెరువు కోసం 8 నెలల క్రితం కువైత్‌కు వెళ్లింది. ఆమెకు ముగ్గురు కూమార్తెలు, భర్త వెంకటేశ్వర్లు ఉన్నారు. భర్త వికలత్వంతో బాధపడుతున్నారు. ఒక కుమార్తె 6 తరగతి, మరో కుమార్తె 8 తరగతి చదువుతుండగా పెద్ద కుమార్తె సమీపంలోని ఫ్యాక్టరీలో కూలి పనికి వెళుతోంది. కుటుంబ పోషణ కోసం తాను కువైత్‌కు వెళ్లానని, అక్కడ కొంతమంది నన్ను చిత్రహింసలకు గురి చేస్తున్నారని రోదిస్తూ సెల్ఫీ వీడియోను విడుదల చేసింది. దీనిని చూసిన మంత్రి స్పందించి ఆమెను ఇండియాకు రప్పిస్తామని, వెంటనే సంబంధిత మంత్రి, అధికారులకు లెటర్ రాశారు.

ఫ్రీహోల్డ్ భూములపై సీఐడీ విచారణ

- సబ్‌కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో తనిఖీలు
- నలుగురు రైతుల స్టేట్‌మెంట్ల రికార్డు..!



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలోకి విచారణకు వెళుతున్న సీఐడీ అధికారులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 12: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో సీఐడీ అధికారులు మరో అడుగు ముందుకు వేశారు. గురువారం సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో అధికారులు స్థానిక సబ్ కలెక్టరేట్‌లో విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా పెద్దమండ్యం మండలం ముసలికుంటకు చెందిన భూముల విషయమై శిరీష అనే రైతు డాటెడ్ ల్యాండ్ (చుక్కల భూమి) విషయమై ఫ్రీహోల్డ్‌కు దరఖాస్తు చేసుకుంది. దీనికి సంబంధించి ముసలికుంట వీఆర్వో, విలేజ్ సర్వేయర్‌ను విచారించారు. అంతేకాకుండా రైతు శిరీషా దరఖాస్తు వివరాలు, భూమి వివరాలను జిరాక్స్ తీసుకున్నట్లు సమాచారం. అనంతరం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న సీఐడీ అధికారులు తహసీల్దార్ ఖాజాబీ సమక్షంలో పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా కోళ్లబైలు, వలసపల్లె, బసినికొండ గ్రామాలతో పాటు మరో గ్రామానికి చెందిన రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ నాలుగు రెవెన్యూ గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూముల కోసం దరఖాస్తు చేసుకున్న నలుగురు రైతులను పిలిపించి విచారించారు. ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నారు..? ఎవరు రెకమండేషన్ చేశారు..? ఏ అధికారి అయినా వ్యక్తిగతంగా మాట్లాడారా తదితర వివరాల గురించి రైతులను విడివిడిగా అడిగినట్లు సమాచారం. దీంతో పాటు నలుగురు రైతుల వద్ద స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నట్లు తెలిసింది. కాగా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటన జరిగి 50 రోజులు గడుస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆగస్టు 6వ తేదీ ఈ కేసును సీఐడీ అధికారులకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందులో భాగంగా సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మదనపల్లెకు వచ్చి సబ్‌కలెక్టరేట్‌లో ఘటన జరిగిన భవనంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. అనంతరం సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పలుమార్లు రెవెన్యూ అధికారులను, రైతులను విచారిస్తూనే ఉన్నారు. అలాగే అనుమానం వున్న సర్వే నెంబర్ల వివరాలు, ఫ్రీహోల్డ్ భూముల దరఖాస్తు దారులను విచారిస్తున్నారు. ఫైళ్ల దహనం కేసులో ఎఫ్ఎస్ఎల్ రిపోర్టుల ఆధారంగానే కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ రిపోర్టులు ఇప్పటికే సీఐడీ అధికారులకు చేరాయా..? లేక ఇంకా ఆలస్యం అవుతుందా అనే అంశంపైనే అందరి దృష్టి ఉంది.

ఎనిమిది మంది ఎక్కడ ఉన్నారో..?

మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో మదనపల్లె వన్‌టౌన్, టూటౌన్, తాలూకా పోలీసు స్టేషన్‌లలో పోలీసులు ఎనిమిది కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న వి.మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, శశికాంత్, రామకృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ, మరో ఇద్దరిపై కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి వీరందరూ మదనపల్లె విడిచి వెళ్లారని తెలుస్తోంది. ఇందులో ఇద్దరికి హైకోర్టు బెయిల్ ఇచ్చిన క్రమంలో వారిద్దరూ మదనపల్లెకు వచ్చినా, గత పది రోజుల క్రితం సీఐడీ అధికారులు మదనపల్లెకు విచారణకు వచ్చాక వీరిద్దరు కూడా మళ్లీ మదనపల్లె విడిచి వెళ్లినట్లు తెలుస్తోంది. సీఐడీ కేసులో సమగ్ర విచారణ ముగిశాకే, సాక్ష్యాలు, ఆధారాలతో నిందితులను అరెస్టు చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వరద బాధితులకు భారీ వితరణ

పలు సంస్థలు, వ్యక్తులు కలిసి రూ.34.45 లక్షల చెక్కు సీఎంకు అందజేత



సీఎం చంద్రబాబుకు చెక్కు అందచేస్తున్న డాక్టర్ రామసుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్‌హుస్సేన్, చిత్రంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితులకు బాసటగా అన్నమయ్య జిల్లా వాసులు నిలిచారు. గురువారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన పలు సంస్థల యజమానులు, వ్యక్తులు రూ.34 లక్షల 45 వేల రూపాయల చెక్కును సీఎం సహాయనిధికి చంద్రబాబుకు అందచేశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా పరిధిలోని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి రూ.15 లక్షలు, రాయచోటి నియోజకవర్గానికి చెందిన విశ్వం ప్రభాకర్‌రెడ్డి రూ.5 లక్షలు, సంబేపల్లె మండలంలోని నల్లగంగమ్మ తల్లి స్టోన్‌క్రషర్స్ రూ.5 లక్షలు, డాక్టర్ రామసుబ్బారెడ్డి రూ.5 లక్షలు, ప్రముఖ వైద్యులు, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్, దివంగత డాక్టర్ దాదాసాహెబ్ కుమారుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్‌హుస్సేన్ రూ.3 లక్షలు, రాయచోటిలోని శారద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ రూ.55 వేలు, సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వారు రూ.50 వేలు, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వారు రూ.20 వేలు, పోతులూరి వీరబ్రహ్మేంద్ర విద్యామందిర్ ఉన్నత పాఠశాల వారు రూ.15 వేలు, రాయచోటి పట్టణానికి చెందిన జే.వెంకట్‌రెడ్డి రూ.5 వేలు చొప్పున విరాళంగా అందజేశారు.

చెరుకూరి రవికుమార్ రూ.5 లక్షలు



మంత్రి నారా లోకేశ్‌కు చెక్కును అందిస్తున్న టీడీపీ యువ నాయకుడు చెరుకూరి రవికుమార్

పోరుమామిళ్ల, సెప్టెంబరు 12 : విజయవాడ వరద బాధితులకు టీడీపీ నాయకుడు కమ్మవారిపల్లెకు చెందిన చెరుకూరి రవికుమార్ రూ.5లక్షలు చెక్కును మంత్రి లోకేశ్‌కు అందించారు. గురువారం విజయవాడలోని సచివాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డితో పాటు ఆయన మంత్రి లోకేశ్‌ను కలిసి రూ.5లక్షలు చెక్కును అందించారు. అలాగే గురువారం విజయవాడ సెక్రటేరియట్ చాంబరులో చెక్కు అందించారు. అలాగే నియోజకవర్గ,కార్యకర్తలు ఎదుర్కొనే సమస్యలపై వివరించారు.

డీఎంహెచ్‌వోను సస్పెండ్ చేయాలి

ఆశా వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నేతలు కల్పన, వేణుగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న కల్పన

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 12: ఆశా కార్యకర్తలను అవమానకరంగా మాట్లాడుతూ బెదిరిస్తున్న డీఎంహెచ్‌వోను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కల్పన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆశా యూనియన్ నగర సమితి సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సమస్యలపై డీఎంహెచ్‌వో నాగరాజుకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే ఆయన ఉద్యోగులు, ఆశా కార్యకర్తలను అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తూ దాడికి పూనుకోవడం సరికాదన్నారు. తక్షణమే ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి ఆశాలపై సాగుతున్న వేధింపులను తక్షణమే ఆగేలా చూడాలన్నారు. లేదంటే దీక్షలకు పూనుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నేతలు చంద్రశేఖర్, అనసూయ, అమ్మలు, శాంతమ్మ, రాణి, అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ సెంటర్ తనిఖీ



రంగసముద్రం సెంటరును తనిఖీ చేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 12 : మండలంలోని రంగసముద్రం విలేజ్ హెల్త్ సెంటరును జిల్లా టాస్క్‌ఫోర్స్ మెడికల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం వారు ఈ సెంటర్‌ను తనిఖీ చేసి మాతా శిశు సంరక్షణకు సంబంధించి గర్భిణీలకు అన్ని రకాల సేవలు, చిన్నపిల్లలకు సేవలపై విచారించారు. స్కూలు పిల్లలకు ఆరోగ్య సేవలపై విచారణ చేశారు. కార్యక్రమంలో డీపీఎంవో శశిభూషణ్‌రెడ్డి, జిల్లా గణాంకాధికారి రమేశ్‌రెడ్డి, నారాయణ, హరి, రాజశేఖర్, శాంతికళ, మేరీయల్లాస, కరిష్మా, ఆరోగ్య విద్యాధికారి సాదు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో తిరుమల లడ్డూలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 12 : ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామాలయంలో తిరుమల లడ్డూలను టీటీడీ అధికారులు అందుబాటులో ఉంచారు. గతంలో నెలలో 2వ శనివారం, 4వ శనివారం మాత్రమే రామాలయంలో లడ్డూలు అందుబాటులో ఉండేవి. భక్తుల రద్దీ దృష్ట్యా టీటీడీ అధికారులు భక్తులకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు చేశారు. 10 రోజులకోసారి కోదండరామాలయంలో 2500 లడ్డూలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని టీటీడీ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుండి భక్తులు 50 రూపాయలు చెల్లించి లడ్డూలను తీసుకోవచ్చని టీటీడీ సిబ్బంది వినోద్ తెలిపారు.

రూ.3 లక్షలు పలికిన వినాయకుడి లడ్డు




లడ్డుతో ఓర్సు కుటుంబ సభ్యులు

చిన్నమండెం, సెప్టెంబరు 12: మండలంలోని కొత్తపల్లి పంచాయతీ శ్రీనివాసపురంలో వినాయక చవితి సందర్భంగా నెలకొల్పబడిన వినాయక ప్రతిమ వద్ద లడ్డు వేలంపాటను గురువారం నిర్వహించారు. ఈ పాటలో వినాయక స్వామి లడ్డును మూడు లక్షల రూపాయలకు ఓర్సు జయచంద్ర వేలం పాటలో దక్కించుకున్నారు. వినాయక లడ్డును దక్కించుకోవడంతో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయన కుటుంబాన్ని ఘనంగా సత్కరించారు.

గంజాయి ముఠా అరెస్ట్

బద్వేలుటౌన్, సెప్టెంబరు 12 : బద్వేలులో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్‌యాదవ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్సు సిబ్బంది, ఎస్‌ఐలు సత్యనారాయణ, రవికుమార్ సిబ్బందితో కలసి పట్టణ పరిధిలోని చెన్నంపల్లె ఎస్టీ కాలనీ, కాశినాయన గుడిముందు గుట్టు చప్పుడుగా విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేశామన్నారు. వీరిలో బి.కోడూరు మండలానికి చెందిన ఓరుగంటి నరసింహులు, బద్వేలు పట్టణానికి చెందిన తిరుపతి, పొదిలి రాంబాబు, అల్లూరు సీతారామరాజు జిల్లాలోని జీకేవీధి మండలం, వంతెవాండ్లపల్లె గ్రామానికి చెందిన గుమ్మెళ్ల కామేశ్వరరావు, మూర్లచంటబ్బాయి ఉన్నట్లు వారు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాసులు కురిపిస్తున్న దోస



- 60 రోజుల్లో పంట దిగుబడి ... టన్ను రూ.30 వేలు
- ముంబై, హైదరాబాద్, విజయవాడ, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి

చిన్నమండెం, సెప్టెంబరు 12: జిల్లాలో రాయచోటి కరువు పరిస్థితులకు నిలయం. కరువు జిల్లాలో రైతులు ప్రధానంగా వర్షాధారం కింద వేరుశనగ, ఉలవ, కంది లాంటి పంటలపై ఆధారపడి జీవనం సాగించేవారు. అయితే బోరుబావులపై ఆధారపడిన రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. తక్కువ నీటితో డ్రిప్పు, సేద్య విధానాల ద్వారా ఉద్యానపంటలు మామిడి, సపోటా, జామతో పాటు పండ్ల తోటల పెంపకాలపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో కాసులు కురిపించే పంట ఏదైనా ఉందంటే టమోటా అని నిన్న మొన్నటి వరకు చెప్పే రైతులు ప్రస్తుతం దోస కూడా కరువు నేలపై కాసులు కురిపిస్తున్నట్లు చెబుతున్నారు. పంట కాల వ్యవధి 60 రోజులు. మంచి ధర ఉంటే రైతు ఇంట కాసులు కురిసినట్లే. ఈ క్రమంలో జిల్లాలో కొంతమంది రైతులు దోస పంటలు సాగు సాగు చేసి మంచి ఆర్థిక ఆదాయాన్ని పొందుతున్నారు. సంబేపల్లె మండలం పొన్నెలవాండ్లపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి అనే రైతు చిన్నమండెం మండలం దేవగుడిపల్లె ప్రాంతంలో పొలం లీజుకు తీసుకొని 8 ఎకరాలు దోస పంట సాగు చేశాడు. 110 టన్నులు దిగుబడి వచ్చింది. టన్ను ధర రూ.30 వేలు పలకడంతో 60 రోజుల వ్యవధిలో 33 లక్షలు సంపాదించారు. ఒక ఎకరాకు 90 వేల నుంచి లక్షా పది వేల వరకు పెట్టుబడి పెట్టాడు. 8 ఎకరాలకు 10 లక్షల నుంచి 12 లక్షలు ఖర్చు చేసినా తక్కువ రోజుల్లో సుమారు 20 లక్షల ఆదాయం వచ్చినట్లు రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. అతి తక్కువ కాలంలో డబ్బులు సంపాదించడం దోస పంటతో సాధ్యమని రుజువు చేశారు. దోస పంటకు 20 రోజుల నుంచి 36వ రోజు వరకు పూత, పిందె దశకు మారే సమయంలో జడివానలు పడితే దిగుబడిపై పూర్తి స్థాయిలో ప్రభావం చూపుతాయి. ఇలా 36 రోజుల తర్వాత దిగుబడులు రావు. అలాగే కోత దశకు వచ్చినప్పుడు జడివానలు పడినా కాయలు చెడిపోయి రైతు దెబ్బతినే అవకాశాలు ఎక్కువ. ఇలా దోస పంట సరైన సమయంలో వర్షాలు పడినట్లయితే పూర్తిగా నష్టపోతారు.

నిలకడ లేని ధరలతో నష్టాలు వస్తాయి

నిలకడ లేని రేట్లతో జూదాన్ని తలపించేలా దోస పంటలు రేట్లు ఉంటాయి. మార్కెట్‌లో రెండు, మూడు రోజుల్లోనే కిలో మీద 5 నుంచి 15 రూపాయలు వ్యత్యాసాలు ఉంటాయని రైతులు తెలిపారు. రైతుల అదృష్టాన్ని బట్టి రేట్లు ఒక్కోసారి అధికంగానూ, ఒక్కోసారి స్వల్పంగానూ ఉంటాయంటున్నారు. చాలావరకు దోసకాయలు విజయవాడ, హైదరాబాద్, ముంబై, చెన్నై ఇలా దూర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తారు. ఈ ప్రాంతాల్లో దిగుబడి ఎక్కువైనా వర్షాలు పడినా గిరాకీలు తగ్గిన రేట్లపై పూర్తి స్థాయిలో మార్పులు జరుగుతాయి.



తోటలో దోస కాయలను కోస్తున్న కూలీలు

దిగుబడి తగ్గినా, రేట్లు తగ్గినా నష్టం తప్పదు



గత ఏడు సంవత్సరాలుగా దోస పంట సాగు చేస్తూనే ఉన్నా. కానీ గత ఏడాది మాత్రం మంచి దిగుబడితో పాటు మంచి రేట్లు వచ్చాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు పెట్టుబడులు కూడా ఎక్కువ అవుతున్నాయి. మల్చింగ్, మందుల పిచికారీ, డ్రిప్పు, ఎరువులు ఇలా ఎకరాకు దాదాపు 90 వేల నుంచి లక్షా 10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. మంచి దిగుబడి వచ్చి రేట్లు ఉంటే మంచి ఆదాయం వస్తుంది. దిగుబడి తగ్గినా రేట్లు తగ్గినా పూర్తిగా నష్టపోతారు.

- భాస్కర్‌రెడ్డి, రైతు

డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ అత్యంత ఆవశ్యకం



బీఎల్ఎస్ ప్రకాశరావును సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 12: నేటి సమాజానికి డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ అనేవి అత్యంత ఆవశ్యకమైనవని ఇండియన్ స్టాటిస్టకల్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసరు బీఎల్ఎస్ ప్రకాశరావు తెలిపారు. గురువారం ఆర్ట్స్‌కళాశాలలో ఇండియన్ స్టాటిస్టకల్ ఇనిస్టిట్యూట్, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్ సంయుక్త ఆధ్వర్యంలో డేటా సైన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ అంశంపై నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ సాంకేతికత విస్తరించే కొద్దీ జనాభా పెరుగుదలకు అనుగుణంగా స్టాటిస్టిక్, ఇతర సాంకేతిక మాధ్యమాల అవసరం కూడా విపరీతంగా పెరుగుతోందన్నారు. ఆధునిక కాలంలో ఎన్నో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే సబ్జెక్టు స్టాటిస్టిక్స్ అని తెలిపారు. ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్‌స్టాటిస్టిక్స్ సంస్థ గౌరవాధ్యక్షుడు రిటైర్డ్ ప్రొఫెసరు రాజశేఖర్‌రెడ్డి ప్రసంగించారు. ఈ స మావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఇటువంటి అవకాశాలు అందిపుచ్చుకుని వేగంగా ఎదిగేందుకు స్టాటిస్టిక్స్ వంటి సబ్జెక్టులు, ఐఎఫ్ఎస్, ఐఎస్‌పీఎస్ వంటి సంస్థలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ముఖ్యఅతిధికి కళాశాల యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు మల్లేశ్వర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈబీసీ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలు



మాట్లాడుతున్న ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 12: డిగ్రీ చదివే విద్యార్థుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలని ఆ దిశగా చర్యలను వేగవంతం చేయాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం వైవీయూ అనుబంధ డిగ్రీకళాశాలల ప్రిన్సిపాల్స్, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రియేట్ ఆటోమేటెడ్ పర్మినెంటు అకడమిక్ అకౌంట్స్ రిజిస్ట్రీ ఐడీల సృష్టిపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020 ప్రాముఖ్యత అనుసరించి విద్యార్థులందరికీ ఏబీసీ, ఏపీఏఆర్ నమోదును ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. ఈ విషయంపై ఉన్నత విద్యామండలి ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. విద్యార్థుల రిజిస్టరు ఐడీ భవిష్యత్తులో అత్యంత కీలకం కానుందన్నారు. కళాశాల విద్యార్థులకు సంబంధించి మార్కుల జాబితా, సర్టిఫికెట్లు అన్నీ ఈ ఐడీకే వ చ్చే అవకాశం ఉందన్నారు. ఇది విద్యార్థుల సర్టిఫికెట్లను నిల్వ చేసే బ్యాంకుగా మారనుందన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించే ఈ పోర్టల్ ఆవశ్యకత గుర్తించాలని రిజిస్ట్రార్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. నూతన విద్యాసంబంధం సంస్కరణలకు అనుగుణంగా ఈ ప్రక్రియను వేగంగా చేపట్టాలన్నారు. కేంద్రరాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తున్న ఈ కార్యక్రమన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసరు శ్రీనివాసులు, నానో టెక్నాలజీ విభాగ సహాఆచార్యులు డాక్టర్ విజయకుమార్, జిల్లాలోని అన్ని డిగ్రీకళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

నకిలీ బంగారం కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

రాజంపేట టౌన్, సెప్టెంబరు 12 : నకిలీ బంగారం కేసులో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు రాజంపేట పట్టణ సీఐ యల్లంరాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం జనగాన జిల్లా ఘణాపురం మండలం బుర్రక్కాయలగూడెం గ్రామానికి చెందిన తుమ్మల శ్రీధర్ రాజంపేట పట్టణ పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. రాజంపేట నియోజకవర్గం వీరబల్లె మండలం శికారుపాలెంకు చెందిన గోవింద గంగరాజు, రాణాఅరవింద్ పోవార్ అనుపతి అనే వ్యక్తులపై తెలంగాణ రాష్ట్రంలో ఓ నకిలీ బంగారు విషయంపై ఫిర్యాదు రావడంతో ఈ కేసు నమోదు చేశామన్నారు. వీరు బుర్రక్కాయలగూడెం తెలంగాణ రాష్ట్రంలో తిరుగుతూ తమది కేరళ అని, తాము జేసీబీ డ్రైవర్లమని ఇక్కడ పనిచేస్తుండగా 3 కిలోల బంగారం దొరికిందని, 10 లక్షలు డబ్బు తీసుకువస్తే బంగారు ఇస్తానని చెప్పి వాట్సాప్ ద్వారా వారి స్నేహితులైన వారికి వీడియోకాల్ ద్వారా చూపించి వారి వద్ద నుంచి 5 .60 లక్షల నగదు 2.24 లక్షలు విలువ చేసే ఫోన్లు తీసుకోవడం జరిగిందన్నారు. తీరా నకిలీ బంగారమని తెలియడంతో రాజంపేట నియోజకవర్గం సుండుపల్లెలో నిందితులు ఉండడంతో వారి ఫిర్యాదు మేరకు రాజంపేటలో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4.45 లక్షలు నగదు, 3 ఐ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వీరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఓబులేశుకోన భూఆక్రమణపై ఆర్డీవో విచారణ



ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటపతి, అధికారులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 12: మండల పరిధిలోని పెన్నపేరూరు రెవెన్యూ పరిధిలోని ఓబులేశు కోన సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగుచేస్తున్న భూములను కడప ఆర్డీవో వెంకటపతి, తహశిల్దారు రమణమ్మ, సర్వేయర్ వేణుగోపాల్‌లు పరిశీలించారు. సర్వేనంబరు 621లో దాదాపు 90 ఎకరాలు ఆక్రమించి సాగు చేస్తున్న రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించారని స్థానికంగా ఉన్న కొంతమంది టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. పెన్నపేరూరు పరిధిలోని 90 ఎకరాల మేరకు ఆక్రమించారని వారు పేర్లను కూడా రెవెన్యూ అధికారులు నివేదిక ఆర్డీవోకు సమర్పించినట్లు సమాచారం. వైకాపా పార్టీకి చెందిన ఇరువురు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ భూమిని తమ ఆధీనంలో ఉంచుకుని సాగు చేస్తున్నారని గుర్తించామని రెవెన్యూ అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహశిల్దారు రమణమ్మ అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గండికోట నుంచి

మైలవరానికి నీరు విడుదల

కొండాపురం, సెప్టెంబరు 12: గండికోట ప్రాజెక్టు నుంచి శుక్రవారం మైలవరం జలాశయానికి నీరు విడుదల చేయనున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టులో శుక్రవారం నీటిమట్టం 25 టీఎంసీలకు చేరుతుందని అందువల్ల మైలవరం జలాశయానికి వదలనున్నట్లు ఆయన తెలిపారు. కాగా ప్రస్తుతం సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.గండికోట ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా 10000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో గురువారం సాయంత్రానికి 24.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



సబ్ కలెక్టర్ నిదియాదేవికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, సెప్టెంబరు 12: గిరిజనులకు ఇచ్చిన భూములను ఆక్రమించిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. గురువారం రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలం మంగళంపల్లె గ్రామ పంచాయతీలోని గిరిజనకాలనీలో నివసిస్తున్న నిరుపేదలకు 1996లో అప్పటి రెవెన్యూ శాఖాధికారులు 1.52 ఎకరాలను పలువురికి పంపిణీ చేశారని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలతో పాటు ఆన్‌లైన్ కూడా చేశారని తెలిపారు. కానీ అదే గ్రామ పంచాయతీకి చెందిన అగ్రవర్ణాలు ఆక్రమించుకున్నారని, తక్షణమే రెవెన్యూ శాఖాధికారులు వారిపై కేసులు నమోదు చేయించాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సామూహిక నిరాహార దీక్షలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, కృష్ణయ్య, గంగయ్య, ప్రసాద్, జయరాం, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం సీపీఐ విరాళాలు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 12: మండల పరిధిలోని సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేపట్టారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతిచిన్నయ్య, మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ, డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ కార్యదర్శి కటారి గోపాల్, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి రోజమ్మలు కలిసి కొర్లకుంట, చిన్నఓరంపాడు పంచాయతీల్లో ప్రధాన దుకాణాల వద్ద విజయవాడ వరద బాధితులకు విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని సాటి మనిషిగా సహాయం చేయడం మన బాధ్యత అని తెలిపారు.

సీతారాం ఏచూరి మరణం తీరనిలోటు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర, జిల్లా నేతలు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 12: సీతారాం ఏచూరి మరణం వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, రవికుమార్, చంద్రశేఖర్, రాజేశ్వరి, మణి, శాఖా కార్యదర్శులు హరిశర్మ, ఓబులమ్మ, వెంకటచలపతి, వెంకట్రామిరెడ్డి, బాలకృష్ణ, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన పార్టీకి ఎన్నో సేవలు అందించారని, ఎక్కడా రాజీలేని పోరాటాలు చేశారని కొనియాడారు. పోరాట పటిమ కల్గిన వ్యక్తి అని తెలిపారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

ఓబులవారిపల్లె: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం బాధాకరమని కార్మిక పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఆయన ప్రతినిత్యం పేద, బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేశారన్నారు. ఏపీఎండీసీ ఔట్‌సోర్సింగ్ ట్రైనీ కార్మిక పోరాట యూనియన్ తరఫున ఆయన మృతికి సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.





క్రీడలతో మానసిక ఉల్లాసం



సుండుపల్లెలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో, చిట్వేలిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు

రైల్వేకోడూరు/సుండుపల్లె/చిట్వేలి/పుల్లంపేట/నందలూరు/లక్కిరెడ్డిపల్లె/ సెప్టెంబరు 12: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని పలు మండలాల ఎంఈఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రాయ చోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజక వర్గాల్లోని ఆయా మండలాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

ఇందులో భాగంగా రైల్వేకోడూరులో.. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి క్రీడా పోటీలు నిర్వహించారు. చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు అవసరమని తెలిపారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

సుండుపల్లెలో.. మండల కేంద్రమైన జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం క్రీడా పోటీలు నిర్వహించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న, ఫిజికల్ డైరెక్టర్లు రవీంద్రరాజు, రాధారాణిలు తెలిపారు. ఎంఈవో రవీంద్రనాయక్ ఈ క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు.

చిట్వేలిలో... జడ్పీ ఉన్నత పాఠశాలలో స్టేట్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారులు కోదండనాయుడు, ఈశ్వరయ్య, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమరెడ్డిలు క్రీడలను ప్రారంభించారు.

నందలూరులో.. మండల కేంద్రంలోని నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండలస్థాయి క్రీడా పోటీలను ఎంఈఓలు ఎల్.నాగయ్య, సీఆర్ అనంత కృష్ణ, హెచ్‌ఎంఎస్ శ్రీనివాసులు ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో విడివిడిగా బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ పోటీలు నిర్వహించారు.

పుల్లంపేటలో.. ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరాములు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్ క్రీడల్లో పోటీలు నిర్వహించి ఎంపికలు చేపట్టారు.

లక్కిరెడ్డిపల్లెలో.. క్రీడలు మానశిక ఉల్లాసాన్ని ఇస్తాయని జడ్పీ బాలుర హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ క్రీడల్లో కస్తూరిగాంధీ విద్యాలయం, ఏపిమోడల్ స్కూల్, స్థానిక జడ్పీ బాలుర, బాలికల, దేవళంపల్లె, జాండ్రపల్లె, పాఠశాలల బాల, బాలికలు పాల్గొన్నారు.

రామాపురంలో.. నీలకంఠ్రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు, జయచంద్రుడులు ప్రారంభించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెడదాం : జడ్జి



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న అడిషినల్ జ్యుడీషియల్ జడ్జి డాక్టర్ శారద

రాయచోటిటౌన్, సెప్టెంబరు 12: ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థకు ఉన్నత స్థానం ఉన్నదని ఆ గౌరవాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత న్యాయవాదులపైన, న్యాయమూర్తులపైన ఉందని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. రాయచోటి అడిషినల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ శారద రాయచోటి నుంచి వైజాగ్‌కు బదిలీ అయిన సందర్భంగా గురువారం స్థానిక కోర్టులో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన చట్టాలను అమలు చేయడంలో ఏ వ్యవస్థ విఫలమైనప్పటికీ న్యాయవ్యవస్థ ముందుకు వచ్చి సదరు వ్యవస్థను గాడిలో పెట్టడానికి తీవ్ర ప్రయత్నం చేస్తుందన్నారు. ఇతర వ్యవస్థలు చేస్తున్న తప్పులను సరిదిద్దే స్థానంలో న్యాయవ్యవస్థ ఉన్నదని, అందుకే న్యాయవ్యవస్థకు మన రాజ్యాంగం ఉన్నత స్థానం కల్పించిందన్నారు. అనంతరం రాయచోటి నుంచి వైజాగ్‌కు బదిలీ అయిన అడిషనల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ శారద మాట్లాడుతూ రాయచోటి న్యాయవాదులు తనకు బాగా సహకరించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ ఆసిఫా సుల్తానా, రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, ట్రెజరర్ సిద్దయ్యతో పాటు 60 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం

రాజంపేటటౌన్, సెప్టెంబరు 12: రాజంపేట పట్టణంలోని గీతాంజలి డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు, జోనల్ ఛైర్మన్ వై.సుబ్రమణ్యంరాజు, రీజనల్ ఛైర్మన్ ఎస్వీ రమణ, లయన్స్‌క్లబ్ ట్రెజరర్ కేఎస్ నరసింహ, కార్యదర్శి సంతోష్, లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు నాగేశ్వరరావు, టి.లక్ష్మీనారాయణ, డాక్టర్ సి.సుధాకర్‌లు పాల్గొన్నారు. సమావేశంలో బాలసుబ్రమణ్యం తదితరులు మాట్లాడుతూ భావిభారత పౌరులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు తల్లిదండ్రులకంటే గొప్పవారన్నారు.

అంగన్వాడీల్లో మెరుగైన సేవలు: ఏసీడీపీవో

సుండుపల్లె, సెప్టెంబరు 12: అంగన్వాడీల సేవలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని, చిన్నారులను ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని ఏసీడీపీ సుగుణమ్మ తెలిపారు. గురువారం రాయవరం సెక్టార్ పరిధిలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. అంగన్వాడీలకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, వెంకటలక్ష్మి, అంగన్వాడీ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 12: జిల్లా ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని, రాయచోటిని పారిశ్రామింగా అభివృద్ధి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంకన్న కోరారు. గురువారం విజయవాడలో మంత్రి మండిపల్లె రాంప్రసాదురెడ్డిని కలిసి వినతిపత్రం అంజేసినట్లు తెలిపారు. రాయచోటి ప్రాంతంలో చాలా మంది యువకులు ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా మిగిలారని, ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే బాగుటుందని కోరినట్లు ఆయన తెలిపారు.

వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తే సహించం

● ఈ మెయిల్ ద్వారా జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఫిర్యాదు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 12: వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తే సహించమని సహారా వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి హాఫిజ్ ఫర్హాన్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ గురువారం ఠానా సర్కిల్ వద్ద ఉన్న జామియా మసీదు ఎదురుగా టెంట్ ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వక్ఫ్ చట్టంలో ఇలాంటి సవరణలు ముస్లిం మైనార్టీలకు అవసరం లేదని, ఉన్న చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్. అప్తాబ్, గౌరవ సలహాదారుడు మయానా నిజాంఖాన్, చెన్నూరు అన్వర్ బాషా, సహారా జిలాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

పెనగలూరు, సెప్టెంబరు 12: మండల కేంద్రంలోని పి.కొత్తపల్లె గ్రామంలో జరుగుతున్న కార్యసిద్ధి వినాయకస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.19 లక్షలతో ఆలయం పునిర్నిర్మాణం గావించారు. కల్యాణం ముగిసిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనగలూరు, సెప్టెంబరు 12: మండల విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఓబిలి ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్‌స్టేషన్ ఏఈ సయ్యద్ సఫీ తెలిపారు. ఈ సందర్భంగా కోమటిరాజపురం జెట్టివారిపల్లె, రాచపల్లె, ఓబిలి అతిగారిపల్లె గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించాలని కోరారు.

రైతు సేవాకేంద్రం ఆకస్మిక తనిఖీ

సిద్దవటం, సెప్టెంబరు 12: మండలం టక్కోలు రైతు సేవాకేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరావు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి, ఆర్‌బీకే సహాయకులు ఎ.వంశీ, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

రాజంపేట, సెప్టెంబరు 12: రాజంపేటలో ఈ నెల 27 నుంచి 4 రోజుల పాటు జరిగే జిల్లా ద్వితీయ మహాసభలపై ఆ సంఘ నేతలు గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు శివరామకృష్ణదేవర, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి మహేష్, జిల్లా అధ్యక్షుడు మాధవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాలసుబ్రమణ్యం, అనిల్, గణేష్, శ్రావణ్, నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా కూటమి నేతల సంబరాలు

సిద్దవటం, సెప్టెంబరు 12: కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా భాకరాపేట టీడీపీ నేత చెంచయ్యనాయుడు స్వగృహంలో గురువారం టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆనందోత్సాహాలతో భారీగా కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, సీహెచ్‌సీ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్ నాయుడు, రాజశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

సంబేపల్లె, సెప్టెంబరు 12: రాష్ట్ర స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలకు సంబేపల్లె మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థినీలు రుక్సానా, రుక్సార్‌లు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఆయా విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మార్ల ఓబుల్‌రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సూచనల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీల్లో వీరు జిల్లాలో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ నెల 18న విజయవాడలోని కేఎల్ యూనివర్శిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, విజయసారథిరెడ్డి, రామయ్య, దేవప్రసాద్‌రెడ్డి, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘననాథుని నిమజ్జనం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 12: వినాయక చవితి పురస్కరించుకొని మండలంలో వాడవాడలా వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. లక్కిరెడ్డిపల్లె టౌన్‌లో 20 విగ్రహాలకు పైగా ఏర్పాటు చేశారు. కాకుళవరం మునిరెడ్డిగారిపల్లెకు చెందిన అబ్బవరం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (సినిమాహీరో) వీలం భరత్‌రెడ్డి వినాయకుని లడ్డూ రూ.67,100కు వేలంపాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో సాంబశివ, వెంకటరమణ, జయరాం, రియాజ్, నాగేంద్ర మహబూబ్‌బాషా, యువకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జబర్దస్త్ టీమ్ ప్రదర్శన



రియాలిటీషో ప్రదర్శిస్తున్న జబర్దస్త్ టీమ్ సభ్యులు

పెనగలూరు, సెప్టెంబరు 12: మండలంలోని పి.కొత్తపల్లె గ్రామంలో జరుగుతున్న కార్యసిద్ధి వినాయకస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జబర్దస్త్ టీమ్ సభ్యుల ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. రాత్రి 10.30 గంటలకు ప్రారంభించిన ప్రదర్శన కార్యక్రమం ఒంటిగంట వరకు కొనసాగింది. వారి ప్రదర్శన కార్యక్రమం ప్రజల్లో నవ్వులు కురిపించాయి. జబర్దస్త్ టీమ్ సభ్యులు ఇమ్మానుయేల్, శాంతికుమార్, రాజేంద్ర, శ్రీలేఖ, దొరబాబు, సాయి, అనిత తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. జబర్దస్త్ టీమ్‌లోని ఆరుగురు ఒకేసారి వేదికపై కనపించడంతో వేలాది మంది ప్రజలు తరలివచ్చారు.

5 ఏళ్లలో అంతులేని ఆక్రమణలు

● వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే ప్రభుత్వ భూములు

● సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాలసుబ్రమణ్యం



సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాలసుబ్రమణ్యం

సుండుపల్లె,సెప్టెంబరు 12: గత ఐదేళ్లలో మండలంలో వైసీపీ నాయకులు అంతులేని ఆక్రమణలకు పాల్పడ్డారని, ఆక్రమణల నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవికి గురువారం ఫిర్యాదు చేశారు. మండలంలో అక్రమంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని కోట్లాది రూపాయలు దండుకున్నారని, వైసీపీ నాయకుల కబ్జాలను అధికారులు వెలికితీసి ఆ భూములను ప్రభుత్వ పరం చేసుకోవాలన్నారు. వాగులు, వంకలు, చెరువులు, గుట్టలు, కొండలను సైతం ఆక్రమించి అక్రమ పట్టాలు సృష్టించారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ.1.66 లక్షలు నగదు స్వాధీనం

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 12: మంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో కంప చెట్లలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు. కచ్చితమైన సమాచారం అందడంతో కోడూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు ఓబులవారిపల్లె ఎస్ఐ పి.మహేష్‌లు పోలీసు సిబ్బందితో మంగంపేట దగ్గర ఉన్న కంపచెట్లలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,66,360 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'అంగన్వాడీలపై బెదిరింపులు ఆపాలి'

రైల్వేకోడూరు, సెప్టెంబరు 12: అంగన్వాడీలపై బెదిరింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య, అంగన్వాడీ జిల్లా కో-కన్వీనర్ సరోజనమ్మలు తెలిపారు. గురువారం ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు నిర్మల అధ్యక్షతన అంగన్వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఇచ్చిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదని, సొంత సెల్‌ఫోన్ల ద్వారా యాప్ నుంచి అంగన్వాడీ కార్యక్రమాలను నమోదు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ప్రతి నెల 5న జీతాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు జయలక్ష్మీ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● దళిత వర్గాల ఆందోళన



రాజంపేట అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న పులపత్తూరు దళితులు

రాజంపేటటౌన్, సెప్టెంబరు 12: తమను అకారణంగా గణేష్ నిమజ్జనం సందర్భంగా దాడిచేసిన అగ్రవర్ణాలపై చట్టబద్ధంగా చర్యలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేయాలని పులపత్తూరు గ్రామ దళితులు రాజంపేట అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద పులపత్తూరు దళిత మహిళలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. తమకు న్యాయం జరగకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకుంటామన్నారు.

రూ.71 వేలు పలికిన వినాయకుడి లడ్డూ

గాలివీడు, సెప్టెంబరు 12: మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం గొల్లపల్లిలోని వినాయకుడి నిమజ్జనం సందర్భంగా గురువారం జరిగిన 125 కేజీల లడ్డూ వేలంపాటలో రూ.71,116లకు మురుగు మల్లికార్జుననాయుడు, మురుగు చంద్రశేఖర్‌నాయుడు, మురుగు నాగేశ్వర్‌నాయుడు వారి కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. అలాగే మండెం పెద్దరెడ్డప్పనాయుడు, నడిపిరెడ్డప్పనాయుడు స్వామి వారి చెరుకు గడులు రూ.20 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్‌నాయుడు, వెంకటాద్రినాయుడు, చలపతినాయుడు, సుధాకర్‌నాయుడు, మురుగు శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లిలో రూ.25 వేలు..

మండలంలోని బాగంపల్లి గ్రామపంచాయతీ కుంటల ముందర (వవడ్డేపల్లి)లో జరిగిన వినాయక స్వామి లడ్డూ వేలంపాటలో అదే ఊరికి చెందిన ధనాంజి కుటుంబ సభ్యులు రూ.25 వేలకు వేలంపాటలో దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. అలాగే గ్రామపంచాయతిలోని దిన్నేమీద బలిజపల్లిలో ఘణనాదుని నిమ్మజ్జనం సందర్భంగా జరిగిన లడ్డును వేలంపాటలో లడ్డును గోవిందుగారి వెంకటరమణ రూ.18,716 లకు దక్కించుకున్నారు. కలశం, చెంబును రూ.5 వేలకు రెడ్డిచర్ల సిద్ధార్ధ దక్కించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రంలోని కార్తీకేయ నగర్‌లోని వినాయకుని విగ్రహం వద్ద కురబ సంఘం మండల అధ్యక్షుడు మద్దికారి జయరాం కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రం నిర్వహించారు.

104 వైద్య సేవలు ఆకస్మిక తనిఖీ



సేవలపై ఆరాతీస్తున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 12: రాయచోటి మండలంలోని యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల దిగువ అబ్బవరం గ్రామం నక్కావాండ్లపల్లెలో నిర్వహిస్తున్న 104 వైద్యసేవలను జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్, డీఎన్‌ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దిగువ అబ్బవరం ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలో ఉన్న షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు సక్రమంగా 104 సేవలకు వచ్చి సేవలు పొందుతున్నారా అని డేటా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యండపల్లి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత లేని మధ్యాహ్న భోజనం : సీపీఐ

రామాపురం, సెప్టెంబరు 12: మండలంలో గోపగుడిపల్లె పంచాయతీ గోపగుడిపల్లి జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వాహకులు నీరుగార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మధ్యాహ్న భోజన పథకం పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్య సభ్యులు కత్తి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.









వరద బాధితులకు సరుకులు పంపిణీ చేస్తాం : ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 12: విజయవాడలో వరద బాధితులకు సరుకులు, గ్యాస్ స్టౌవ్‌లు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం విజయవాడకు చేరుకున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు అక్కడ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో చర్చించి మదనపల్లె నుంచి తీసుకొచ్చిన మూడు లారీల సరుకులను సెంట్రల్ విజయవాడలోని సింగ్‌నగర్, చుట్టుపక్కల ప్రాంతాల్లో వరద బాధితులకు పంపిణీ చేస్తామన్నారు. సింగ్‌నగర్‌లో పర్యటించి ఉన్నతాధికారులతో చర్చించి, మారుమూల ఉండే బాధితులను గుర్తించారు. వారికి మదనపల్లె నుంచి తీసుకెళ్లిన సరుకుల కిట్లను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, నాగార్జున గాంధీ, బాలుస్వామి, తదితరులు పాల్గొన్నారు.


విజయవాడ సింగ్‌నగర్‌లో పర్యటిస్తూ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

వరద బాధితుల సహాయార్థం మిట్స్ చేయూత

కురబలకోట, సెప్టెంబరు 12: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం మిట్స్ విద్యార్థులు చేయూతనందించారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో రూ.51వేల విరాళాలను సేకరించారు. కాగా ఈ విరాళాన్ని సీఎం సహాయనిధికి ప్రిన్సిపాల్ సి.యువరాజ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయాల్లో ప్రతి ఒక్కరూ చేయూతనందించి ఆదుకోవాలన్నారు.

వరద బాధితులకు ఆరోగ్యమాత విద్యార్థుల వితరణ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితులకు పట్టణంలోని ఆరోగ్యమాత హైస్కూల్ విద్యార్థులు రూ.10వేల విలువ చేసే సరుకులను వితరణగా అందజేశారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో పద్మావతికి ఈ సరుకులను అందజేశారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పాకెట్ మనితో విరాళాలు సేకరించి, ఈ సరుకులు కొనుగోలు చేసి వితరణగా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమాత స్కూల్ యజమాన్యం, కరాటే ఇస్మాయిల్ పాల్గొన్నారు.



ప్రీస్కూల్ పిల్లల హాజరులో వ్యత్యాసం ఉండరాదు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 12: అంగన్‌వాడీలకు వచ్చే ప్రీ స్కూల్ పిల్లల హాజరు నమోదులో వ్యత్యాసం ఉండరాదని సీడీపీవో సుజాత పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మదనపల్లె ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్ల సమావేశంలో సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వచ్చే పిల్లల హాజరును రిజిస్టర్‌లో ఎంత నమోదు చేశారో, బాలసంజీవని యాప్‌లో కూడా అంతే నమోదు ఉండాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పీలేరులో: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ప్రీ స్కూల్ విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ పేర్కొన్నారు. పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పీలేరు, కలకడ, కేవీపల్లె మండలాల అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, పీలేరు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సంయుక్త సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె, కలకడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పీలేరు టీబీ నియంత్రణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రానికి విజయం తీసుకురావాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 12: టీ-20 అసోసియేషన్ నిర్వహించనున్న జాతీయస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో మన రాష్ట్రానికి గొప్ప విజయం తీసుకురావాలని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి పేర్కొన్నారు. గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులో అండర్ -19 టీ-20 రాష్ట్ర జట్టుకు ఎంపికైన రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లెకు చెందిన వల్లాల దర్శన్‌రాజు, వినయ్‌కుమార్‌లకు రూ.15వేల విలువ చేసే క్రికెట్ కిట్‌ను సర్పంచ్ చలపతి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా చలపతి మాట్లాడుతూ ఎలాంటి కోచింగ్ లేకపోయినా మారుమూల గ్రామంలో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తూ రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారులకు తన వంతు ప్రోత్సాహకంగా క్రికెట్ కిట్ అందించానన్నారు. ఈనెల 18నుంచి 22 వరకు నేపాల్ దేశంలోని పోఖ్రాన్‌లో నిర్వహించే టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో వారిద్దరు పాల్గొనడం అభినందనీయమన్నారు. మురళి, సాయిశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

జగన్ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి

ములకలచెరువు, సెప్టెంబరు 12: వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతి నిధి గుత్తికొండ త్యాగరాజు పేర్కొన్నారు. మండలంలోని కాలువపల్లెలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విపత్తులను సైతం ఎదుర్కొని విజయవాడ వరద బాధితులను ఆదుకుని ఆపదలలో ఆపద్బాంధువుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై జగన్ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరన్నారు. ప్రకాశం బ్యారేజ్ గేట్లను పడవలతో ఢీకొట్టించిన నిందితులకు జగన్ బాసటగా నిలవడం దారుణమన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ మస్తాన్, నాయకులు మౌలాసాహెబ్, చాంద్‌బాషా, రవినాయుడు, మహేష్‌శివారెడ్డి పాల్గొన్నారు.

'వైసీపీ నాయకుల తీరు బాగలేదు'

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 12: రాష్ట్రంలో వైసీపీ నాయకుల మానసిక తీరు బాగలేదని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ దుయ్యబట్టారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ విజయవాడలో బ్యారేజ్ బద్దలు కొట్టేందుకు వైసీపీ నాయకులు ఉగ్రవాదుల రీతిలో కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా మూడు లారీల సరుకులు, నిత్యావసరాలు పంపడం అభినందనీయమన్నారు. టీడీపీ నేతలు లక్ష్మన్న, అన్వర్ బాషా, సత్యారెడ్డి, రామాంజులు పాల్గొన్నారు.





దేవర సినిమాచూసి చచ్చిపోతా

అమ్మా.. అప్పటిదాకా బతికించండి

తిరుపతిలో బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న యువకుడి వేడుకోలు

● బతికించండంటూ తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

తిరుపతి(విద్య), సెప్టెంబర్ 12 : "నా బిడ్డకి బ్లడ్ కేన్సర్. జూనియర్ ఎన్టీయార్‌కి వీరాభిమాని. రోజు రోజుకీ పరిస్థితి విషమిస్తోంది. 'అమ్మా దేవర సినిమా చూసి చచ్చిపోతా.. 27వ తేదీ దాకా నన్ను బతికించండి..' అని వేడుకుంటున్నాడు" అంటూ 19 ఏళ్ల కౌశిక్ తల్లి సరస్వతి కన్నీరు మున్నీరవుతూ వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తమ బిడ్డ పరిస్థితి గురించి మీడియాకు వివరిస్తూ సాయం చేయండంటూ ఆమె వేడుకున్నారు. టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు, సరస్వతి దంపతుల పెద్ద కుమారుడు కౌశిక్ ఇంటర్ చదువుతుండగా అనారోగ్యానికి గురయ్యాడు. బ్లడ్ కేన్సర్ అని నిర్ధారణ కావడంతో 2022 నుంచీ చికిత్స తీసుకుంటున్నాడు.బోన్‌మారో చేయాలని వైద్యులు చెప్పారు. హైదరాబాద్‌లోని బసవతారకం కాన్సర్ ఆసుపత్రి సహా చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌ల్లోని ఆసుపత్రులకు తిరిగారు. ప్రస్తుతం బెంగళూరులోని కిడ్‌వై హాస్పిటల్లో కౌశిక్ చికిత్స పొందుతున్నాడు. బోన్ మారో చికిత్సకు దాదాపు రూ.60 లక్షలకు పైగానే ఖర్చవుతుందని తెలియడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. రోజు రోజుకూ మరణానికి దగ్గరవుతున్న కొడుకును చూస్తూ వారు దుఃఖిస్తున్నారు. దాతలు ముందుకు వస్తే బిడ్డ బతుకుతాడని ఆశ పడుతున్నారు. వారి వేదన చూసి 'అమ్మా నేను బతకనని నాకు తెలుసు.. నా కోసం బాధపడకండి.. దేవర సినిమా దాకా బతికించండి చాలు.. నా చివరి కోరిక తీర్చండి' అంటూ తమను బిడ్డ సముదాయిస్తున్నాడని చెబుతూ, కౌశిక్‌కి ప్రాణదానం చేయండంటూ ఆ తల్లిదండ్రులు చేతులు జోడిస్తున్నారు. 9490829381 నెంబరుకు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా గానీ లేదా కె. సరస్వతి, యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 103310100044506, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0801313కు గాని దాతలు తమ సాయాన్ని అందించవచ్చు.సమాచారం కోసం 79956 65169 నెంబరులో కౌశిక్ తల్లిదండ్రులను సంప్రదించవచ్చు.



ఆసుపత్రిలో కౌశిక్



కంటైనర్ కిందపడి నుజ్జునుజ్జయిన కారు

రోడ్డుపై మృతదేహాలు

ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

మరోసారి రక్తమోడిన భాకరాపేట ఘాట్

తిరుమల నుంచి తిరిగివెళ్తూ ప్రాణాలు కోల్పోయిన చిక్‌బళ్ళాపురవాసులు



మృతులు మునివెంకటరెడ్డి, మంజునాథ, రమేష్‌మూర్తి, గాయపడ్డ అల్లావుద్దీన్

చంద్రగిరి, సెప్టెంబరు 12:తిరుపతి-మదనపల్లె రహదారిలోని భాకరాపేట ఘాట్ మరోసారి రక్తమోడింది. తరచూ ప్రమాదాలతో వార్తల్లో వుండే ఈ రోడ్డులో గురువారం జరిగిన అనూహ్య సంఘటనతో కర్ణాటకవాసులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.పోలీసుల కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం, చిక్‌బళ్ళాపుర సమీపంలోని హరిస్థలకు చెందిన తేజస్ కుమార్(35) తన తండ్రి మునివెంకటరెడ్డి(55), బావమరిది మంజునాథ(38)తో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్ళి గురువారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. గోలచిందెనహళ్ళికి చెందిన రమేష్‌మూర్తి(34) కారు నడుపుతున్నాడు. 2గంటల సమయంలో భాకరాపేట ఘాట్ రోడ్డులో వెళ్తుండగా కలకడ నుంచి చెన్నైకి టమోటాలను తీసుకెళ్తున్న కంటైనర్ మలుపు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వీరి కారుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయిపోయింది. సమాచారం అందుకున్న చంద్రగిరి, భాకరాపేట సీఐలు సుబ్బరామిరెడ్డి, ఇమ్రాన్‌బాషా, కళ్యాణి డ్యామ్ వద్ద వున్న పోలీసు శిక్షణ కళాశాల ఎస్ఐలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.పొక్లయినర్‌తో కంటైనర్ కింద వున్న కారును బయటకు తీసేందుకు సాధ్యం కాకపోవడంతో తిరుపతి నుంచి ఒక క్రేన్, భాకరాపేట నుంచి మరో క్రేన్ రప్పించారు.ఈలోపు పోలీసులతో పాటు ఆ దారిలో వెళుతున్న వాహనదారులు కంటైనర్‌లో ఉన్న టమోటా బాక్సులను బయటకు తీశారు. మూడు గంటల సమయంలో క్రేన్ సాయంతో కంటైనర్‌ను అతి కష్టంపై పైకి తీసి, కారులోంచి కేకలు వేస్తున్న తేజస్ కుమార్‌ను బయటకు తీశారు.చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.కారులోనే ఇరుక్కుపోయి మృతి చెందిన రమేష్‌మూర్తి, మంజునాథ, మునివెంకటరెడ్డి మృత దేహాలను బయటకు తీశారు.ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ నర్సింగప్ప సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.తరచూ ఇదే ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఎస్పీ జాతీయ రహదారి అధికారుల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలను చేపడతామని తెలిపారు. కాగా కంటైనర్ డ్రైవర్ అల్లా హుద్దీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఐదు కిలో మీటర్ల దూరం స్తంభించిన ట్రాఫిక్

భాకరాపేట ఘాట్‌లో ఈ ప్రమాదంతో సుమారు ఐదు కిలో మీటర్ల దూరం వాహన రాకపోకలు స్తంభించి పోయాయి.కంటైనర్ కింద కారులోని మృత దేహాలను బయటకు తీయడానికి సాయంత్రం 4గంటలైంది.తరువాత కంటైనర్‌ను పక్కకు తీసి, వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.ఆ లోపు తిరుపతి నుంచి మదనపల్లె, పీలేరుకు వెళ్ళే వాహనాలను చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె, కొత్తపేట మీదుగా భాకరాపేటకు పంపించారు.మరికొన్ని వాహనాలను ఎ.రంగంపేట నుంచి ఐతేపల్లె,దామలచెరువు మీదుగా పీలేరుకు పంపించారు.

జగన్‌తో పలువురు నేతల భేటీ

తిరుపతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌ను గురువారం చిత్తూరు,తిరుపతి జిల్లాలకు చెందిన పార్టీ నేతలు పలువురు కలిశారు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కళత్తూరు నారాయణస్వామి, ఆర్కే రోజా, ఎంపీ మిధున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బియ్యపు మధుసూదనరెడ్డి, వెంకటే గౌడ, డాక్టర్ సునీల్, ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన మోహిత్‌రెడ్డి, అభినయ్, నిషార్ అహ్మద్, రాజేష్, కృపాలక్ష్మి, విజయానందరెడ్డి,నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి,సంజీవయ్య, మేరిగ మురళీధర్ తదితరులు గురువారం తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో జగన్‌తో భేటీ అయ్యారు. నిజానికి ఎన్నికల ఫలితాలతో షాక్‌కు గురైన వైసీపీ నేతలు నైరాశ్యంలో కూరుకుపోయారు.చాలామంది ఇరుగుపొరుగు రాష్ట్రాలకు వెళ్ళిపోయి వ్యాపార పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొందరు స్థానికంగానే వున్నా రాజకీయంగా క్రియాశీలం కాకుండా నిరాసక్తంగా వుంటున్నారు. దీనికి తోడు అధినేత కూడా రాష్ట్రంలో కాకుండా బెంగళూరులో ఎక్కువగా వుంటుండడంతో గత మూడు నెలల కాలంలో పెద్దగా వీరు కలిసింది లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల అరెస్టయి జైలులో వున్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు జగన్ రాష్ట్రానికి రావడంతో వీరంతా తాడేపల్లి చేరుకుని జగన్‌ను కలిశారు. కొందరు బుధవారమే వెళ్ళగా మరికొందరు గురువారం వెళ్ళి అందరూ కలసి బృందంగా వెళ్ళి అధినేతతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉమ్మడి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను జగన్ ఆరా తీసినట్టు తెలిసింది. నియోజకవర్గాల వారీగా పరిస్థితిని ఆయా నేతలను ప్రశ్నించి తెలుసుకున్నట్టు సమాచారం.



బోయకొండ అడవిలో జూదం

13 మంది అరెస్టు.. రూ.13.81లక్షల నగదు సీజ్ ● 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం






విలేకరులతో మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ - పట్టుబడ్డ ద్విచక్రవాహనాలు

చౌడేపల్లె, సెప్టెంబరు 12: బోయకొండ అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్న 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ విలేకరులకు వెల్లడించారు. మదనపల్లెకు వెళ్లే మార్గంలో బోయకొండ అడవిలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందింది. పుంగనూరు రూరల్ సీఐ రామ్‌భూపాల్ తన సిబ్బందితో దాడులు చేశారు. పుంగనూరు మండలం, ములబాగిల్, మదనపల్లె, తమిళనాడు రాష్ట్రం రాణిపేట, కురబలకోట, తిరుపతి రూరల్ పుదిపట్ల, వీటీఎం మండలాలకు చెందిన 13 మంది జూదం ఆడుతుండగా అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,81,050 నగదు, 20 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఏడుగురు పారిపోయారు. పట్టుబడిన వారిలో కురబలకోటకు చెందిన ఒక ఎంపీటీసీ ఉన్నారు. మల్లికార్జున అలియాస్ అర్జున్‌రెడ్డి, బాలాజి నాయక్, అక్కులరెడ్డి, నాగేంద్ర తరచూ పేకాట శిబిరాలు నిర్వహించేవారు. కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులునాయుడు, అల్లాఉద్దీన్, ఎల్లప్ప, రెడ్డెప్ప, వెంకటరమణ, అశోక్, శశిధర్, మధుసూదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నారాయణరాజు (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, సెప్టెంబరు 12: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కార్వేటినగరం పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. కార్వేటినగరం మండలం గాజులకండ్రిగ గ్రామానికి చెందిన కె.నారాయణ రాజు(52) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. దీంతో పాటు చెరుకు కొనుగోలు చేసి, బెల్లం తయారీ చేసేవాడు. పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు చేశాడు. వ్యవసాయంలో నష్టం రావడం, బెల్లం వ్యాపారమూ కలిసి రాకపోవడంతో రుణం తిరిగి చెల్లించలేకపోయాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్థాపానికి గురై ఈనెల 9వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని తిరుపతి స్విమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం గురువారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్వేటినగరం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశైల ఆలయం నుంచి వరసిద్ధుడికి పట్టు వస్త్రాల సమర్పణ



ఐరాల (కాణిపాకం), సెప్టెంబరు 12: బ్రహ్మోత్సవాలలో భాగంగా వరసిద్ధుడికి శ్రీశైల భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం తరపున గురువారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆ ఆలయ ఈవో పెద్దిరాజు, సిబ్బందితో కలసి కాణిపాకంలోని అతిథి గృహం నుంచి ఆలయానికి సంప్రదాయ బద్ధంగా పట్టువస్త్రాలు తీసుకొచ్చి స్థానిక ఈవో గురుప్రసాద్‌కు అందించారు. అనంతరం వారు స్వామిని దర్శించుకున్నారు. వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, శ్రీశైలం ఆలయ ఏఈవోలు మోహన్,హరిదాస్, కాణిపాక ఆలయ సూపరింటెండెట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, రంగస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో కేంద్ర మాజీ మంత్రి



ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 12: కాణిపాక వినాయక స్వామిని గురువారం కేంద్ర మాజీ మంత్రి కిల్లికృపారాణి దర్శించుకున్నారు. ఆమెను సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆమెను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బీసీఎన్ విద్యా సంస్థల విరాళం రూ.5లక్షలు



చెక్కు చూపుతున్న సునీల్ రాజ్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితులకు బీసీఎన్ విద్యా సంస్థల తరపున రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చారు. బీసీఎన్ విద్యా సంస్థల యాజమాన్యం రూ.3 లక్షలు, విద్యార్థులు రూ.2 లక్షలు వంతున సాయం చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను సీఎం సహాయ నిధికి పంపనున్నట్లు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల సీఈవో సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఈసీఈ విభాగాధిపతి జీఎస్.కోదండరామయ్య, పీఆర్వో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలకు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా కమ్మగుట్టపల్లెవాసి



పూతలపట్టు, సెప్టెంబర్ 12 : ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలకు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా సంద్ర అమరేంద్రకుమార్ నియమితులయ్యారు. పూతలపట్టు మండలంలోని కమ్మగుట్టపల్లెకు చెందిన అమరేంద్ర కుమార్ ప్రస్తుతం కడప జిల్లా ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంటులో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

బీరు బాటిల్ తలపై మోదుకుని వ్యక్తి మృతి



కుప్పం, సెప్టెంబరు 12: కుప్పంలో గురువారం రాత్రి మతిస్థిమితం లేని ఓ వ్యక్తి బీరు బాటిల్‌ను తన తలపై తానే మోదుకున్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ జీటీ నాయుడు తెలిపారు. అంతకుముందు అతడు పట్టణంలో ఇద్దరు వ్యక్తులపై దాడిచేసి గాయపరిచాడన్నారు. మృతి చెందిన వ్యక్తి గురించి తెలిసినవారు 9440900733 నెంబరుకు ఫోను చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.